



# తారుమారు - మారుతాం

—: రచన: పాత్రో శ్రీధర్ :—

భళ్లున తెల్లవారింది కోడి కూసింది కోడై కూసింది పల్లెప్రజావాణి. నీలాటిరేవులో భారంగా భాండం నెత్తి కెక్కించుకుంటున్న అచ్చమ్మ ఎక్కడో మున్సబుగారి లోగిట్లో గుట్టుగా ఉంటున్న సూరి నీళ్ళాడిందనే రహస్యాన్ని అతిసుళువుగా—బుచ్చెమ్మ చెవిమీది కెక్కించింది. బుచ్చెమ్మ సుబ్బమ్మకూ; సుబ్బమ్మ వెంకమ్మకూ ఆ రహస్యాన్ని ప్రసారము చేశారు. ఆ వార్త "ఇంతింతై వటుడింతై" యన్నట్లు ప్రతియిల్లూ, ప్రతివాకిలీ గాలించి తుదకు నతవాసన వస్తోందన్న అనుమానమున్న ప్రతీచోటనూ గొంగెత్తి చాటేసిపోయింది. నిప్పులేనిదే పొగరాజదంది లోకం.

అంతేకాకుండా బ్రహ్మాండమైన రహస్యం అతిబ్రహ్మాండంమీద కనిపెట్టబడింది. మానవ సృష్టికి అయోగ్యురాలయిన సూరికి అట్టి యోగ్యత కల్పించిన ప్రతిసృష్టికర్త పట్టుబడ్డాడు. వాడిపేరే 'నెలతక్కువ నరసన్న' ఈనెల తక్కువ నరసన్నకు కాస్త ముందూ; మరికాస్త వెనుకా యీకథ కదుల్తుంది.

* * *

లక్ష్మమ్మకు ఎనిమిదోనెలనే పుట్టాడు నరసన్న అందుకే నెలతక్కువ నరసన్న అనే సార్ధకనామం యేర్పడింది. నిజానికి నరసన్న ప్రతి మానవుడి లాగానే తొమ్మిది నెలలకే పుట్టాడు. గర్భంలోవున్నప్పుడే గణితం నేర్చుకోకపోవడం అనే పొరపాటు చేసినందువల్ల నరసన్నకు యిందులోని నిజానిజాలు అవగతంకాలేదు.

అయితే నరసన్న తొమ్మిదినెలకే జన్మించాడు అనే నగ్నసత్యం ఆ తొమ్మిది నెలలూ సాక్షాత్తు మోసిన నరసన్నకన్నతల్లి లక్ష్మమ్మకుమాత్రం తెలియకపోలేదు. కాని; 'నరసన్న ఎనిమిది నెలలకు పుట్టలేదు—' అని లక్ష్మమ్మ ఎదురుతిరగలేదు. తత్కారణంగా యీ పుకారు పునాదులు వేసుకుంది.

* * *

లక్ష్మమ్మ యవ్వనంలో ఉన్నప్పటిమాట. పల్లెసీమలో అందానికిగీటురాయిగాకూచుంది. కొత్తగా పెళ్లయి వసంతకాలు పోసుకుందేమో అందం ద్విగుణీకృతమయింది. కరణంగారమ్మాయి కోరి జడవేసి యిన్నిపూలు తురిమింది. పెళ్లికని కుట్టించిన కొత్తజాకెట్టు పిటపిటలాడుతోంది. కాటుకకళ్ళు, కాళ్లపారాణి వింత సోయగాన్నిస్తున్నాయి. లంగావోణీయే బాగుంటాయని అవే కట్టుకుంది. కట్టుకున్న మొగుణ్ణిచూసి మురిసిపోయింది.

ముహూర్తానికి ముహూర్తం బాగులేదని మగపెళ్లివారు వెళ్లిపోయారు. ఇంక నెల్లాళ్ళాగాలి. 'అబ్బ! నెల్లాళ్ళే?....తరువాతనో?' ఎందుకో ఒళ్ళు పులకరించింది. కట్టుతెగిన గిత్తలాగ పరుగులెత్తింది లక్ష్మమ్మ.

"ఏటే లచ్చీ! పట్టపగ్గాల్లేకుండాపోతున్నావ్! ఓహెూ తెలిసిందిలే!" అంది గడ్డిమోపుతో ఎదురొచ్చిన ఆదెమ్మ.

"నీకేం తెలిసిందే?" బుంగమూతిపెడుతూ అడిగింది లక్ష్మమ్మ.

"అదే!....యియాలరాత్రికి...."

"ఛీ ఫో! అల్లప్పుడే అల్లూరెల్లిపోనారుగా!"

మళ్లీ అదే పరుగు. పరుగు పరుగు! అలసిపోయింది. చేలోని మంచెమీద వాలిపోయింది. పక్కనున్న గంటెచేనిలో రెండు పాలపిట్టలు కిలకిలా పూసులాడుకుంటున్నాయి. చేతివ్రేళ్లతో కళ్ళుమూసుకొని వ్రేళ్ళసంల్లోనుండి మళ్ళీ చూసింది. మగపిట్ట ఆడపిట్టను ముక్కుతో పొడిచింది. ఒళ్ళుగగుర్పొడిచింది వెల్లకిలా పడుకుంది.

అప్పుడే ఆవరిస్తున్నచీకటిని మటుమాయం చేస్తూ దశమిచంద్రుడు దశకళల నీను తున్నాడు. ఎన్నో వందలరాత్రులు తానీ మంచెమీదనే నిద్రించింది. ఇట్టి అనుభూతి ఎన్నడూ కలుగలేదు. ఎందుకో పాడబుద్ధి కూడా అవుతోంది.

"ఊం!........నో మీ నా మన్నాలో........
....నోమిన్నానాలో....చందామామా!........"

ఠక్కున పాట ఆగిపోయింది. ఎవరివో రెండు బలమైనహస్తాలు తన కళ్ళుమూశాయి. పెనుగులాడి ఆ చేతులను విడదీయగలిగింది. తనముఖంమీదికి రాబోతున్న ఆ ముఖం ఎవరిదో తనకు తెలుసు. ముమ్మాటు తనగురించి ప్రయత్నించి విఫలుడైన మున్సబు వీరయ్యదా ముఖం.

"ఛీ! సిగ్గులేదూ? మళ్లీ వచ్చావెందుకూ?" లక్ష్మమ్మ యీసడించి మంచె దిగి వెళ్ళిపోబోయింది. వీరయ్య యీసారి మాటాడదలచుకోలేదేమోమరి, మౌనంగానే వెన్నంటాడు. సమయమూ, వాతావరణమూ, ఉద్రేకమూ అతనిలో కలిసి కట్టుగా పనిచేశాయి. అడుగెత్తు పచ్చికబయలు సమీపించేసరికి, పులి మేకను అడ్డగించింది. కనుచూపుమేరలో రక్షణ కనబడదు. లక్ష్మమ్మ తిట్టింది కొట్టింది, గిలగిలా గింజుకుంది. చంద్రుడు యీ దృశ్యాన్నిచూస్తూకూడా పూరుకున్నాడు.

దూరంగా గుడ్లగూబ అదేపనిగా అరుస్తోంది. ధర్మానికీ, అధర్మానికీ; నీతికీ, అవినీతికీ అర్ధగంటవరకూ ఘోరమైన పెనుగులాట జరిగింది. కలికాలం తనధర్మం సక్రమంగా నెఱవేర్చింది. ధర్మం నశించింది. అధర్మం జయించింది. లక్ష్మమ్మ నలిగిన శరీరం వాడిపోయింది. కార్యశూరుడిలా వీరయ్య నిష్క్రమించాడు.

నాటినుండి కంచుగంట మ్రోగలేదు. కట్టు పీడిన దూడ అంకె వెయ్యలేదు, లక్ష్మమ్మ యిల్లు వీడలేదు.

ఈ సంఘటన జరిగిన నెలలోపునే నెల తప్పినట్టు తెలుసుకుంది లక్ష్మమ్మ. విధినీ, వీరయ్యనీ, దేవుణ్ణీ, ఆత్మనీ, తనజన్మనీ తిట్టుకొని శాపనార్థాలు పెట్టుకుంది.

అదృష్టం బాగుండి అంతలోనే తనకూ, తన భర్తకూవున్న అడ్డుతొలగింది. ఇంకొక నెలపోయినతరువాత నెలతప్పానని గర్వంగా చెప్పినట్టు చెప్పకుంది లక్ష్మమ్మ.

"పండంటి కొడుకును కనమ్మా" అని దీవించింది అమాయకపులోకం.

తొమ్మిది నెలలకే పుట్టిన నరసయ్య కాకుల లెక్కలలో ఎనిమిది నెలలకే పుట్టాడు. నెల తక్కువ నరసయ్య అయ్యాడు.

* * *

కాలాన్ని, కర్మనూ ఆపగలిగేవాళ్లెవరూ లేరు. లక్ష్మమ్మ కట్టుకున్న మొగుడు కారణం లేకుండానే కాలంచేశాడు. నరసన్న నాలుగేళ్లవాడు. నరసన్ననూ, పొట్టనూ రెండు చేతుల్లో పట్టుకొని పుట్టింటికి చేరింది లక్ష్మమ్మ. పుట్టిల్లుకూడా పాములపుట్టలానేవుంది. ఎవరి దారివాళ్లే చూసుకుంటున్నారు. వచ్చిన లక్ష్మమ్మను రమ్మనాలేదు, వద్దనాలేదు. తల్లి మొదటే లేదు. తండ్రి దగ్గుతూ మంచంమీద పడివున్నాడు. అన్నదమ్ములూ, వదినెలూ వున్నారు. వాళ్లబ్రతుకులుకూడా అంతంత మాత్రంగానే వున్నాయి. మెడకు గుదికట్టిన ఎద్దులాగ కాలాన్ని యీడుస్తోంది.

* * *

వీరయ్య వీరత్వం తగ్గలేదు. ఘనకార్యాలెన్నోచేస్తునేయున్నాడు. వీరయ్యకు కూతురు కూడా పుట్టింది. సంస్కారంలేని పల్లెటూళ్లో నామకరణ మహోత్సవం అంటూచేసి ఎన్నో బహుమానాలు రాబట్టుకున్నాడు పిల్ల; పిల్ల తొడుగులుమాని, లంగావోణీలుపోయి, చీరల వరకూ వచ్చింది. వీరయ్యతో వియ్యమందాలని చాలమంది ఉబలాటపడ్డున్నారు. కాని; వీరయ్యకు కావలసినది ఇల్లరికపుటల్లుడు. వీరయ్యకూతుర్ని పొందాలని చాలామంది వీరులు దారులు కాశారు. కాని లాభంలేక పోయింది. వీరత్వమున్న వీరయ్యకూతురు సూరత్వమున్న "సూరి" ఆ సూరిదగ్గర యీ వీరుల పప్పులుడకలేదు.

చివరకు పక్కవూళ్లోని రామయ్యనాయుడు కొడుకు రమణయ్యకూ ; సూరికీ వైభవంగా వివాహం జరిపించాడు వీరయ్య. రమణయ్య ఇల్లరికం వచ్చాడు. ఇంటిబాధ్యత కూడా వహించాడు.

పెళ్లివారికంటే పెత్తిలుమోసేవారిదే అధికారమంటారు. రమణయ్య అధికారం వూళ్లో యెక్కువగావుంది. అయినదాంట్లో కాని దాంట్లో కలగజేసుకొని పెడసరంగా తిరగడం మొదలుపెట్టాడు.

లోకం మంచి జరిగినా, చెడ్డజరిగినా మంచివాళ్ళు సహిస్తారుగాని; అందులో ఏ వొక్కటి అతిగా జరిగినా చెడ్డవాళ్ళు సహించలేరు. దానికి పరిష్కారం వాళ్లే నిర్ణయించి జేస్తారు. దానిని భగవంతుడుకూడా తప్పించలేడేమో ?

రమణయ్య ఒకనాటిరాత్రి పొలంనుండి యింటికివస్తూ పెద్ద చెఱువుగట్టుమీద దారుణంగా హత్యగావింపబడ్డాడు.

ఈవార్తవిన్న వీరయ్య రౌద్రావతారం దాల్చాడు. ఊరు వూరంతా తగలబెడతానన్నాడు. సూరి శోకసముద్రంలో మునిగిపోయింది. సూరి యవ్వనపుశోభకూడా ఆ సముద్రంలో సమసిపోయింది.

ప్రపంచంలో ఎన్ని హత్యలూ, ఎన్ని విపరీతాలూ, ఎన్ని వింతలు జరిగినప్పటికీ కాలచక్రం ఆశ్చర్యపోయి ఒక్కక్షణమైనా నిల్చుండిపోదు. మనకెందుకులెమ్మని అక్కడనుండి తప్పుకోనూపోదు. విధినిర్వహణలో కాలచక్రానిదే ముందంజ. కాలగమనంలో పదిరాత్రులు తెల్లవారిపోయాయి. సూరి మెల్లగా పొలంపనులకుపక్రమించింది.

* * *

నాలుగేళ్ల నరసన్న యిప్పుడు ఇరవైనాలుగేళ్లవాడయ్యాడు. శరీరం కండలుతిరిగింది. మీసం మెలితిరిగింది. అదృష్టం అదుకుంది. పొలం కలిసొచ్చింది. చిన్నరకం నాయరికం వరించింది. నరసన్న నాయుడయ్యాడు.

నరసన్నాయుడు పొలంపనిచేసి యింటికి వస్తున్నాడు. నిస్త్రాణంగావున్న దేహానికి పల్చని చిఱుగాలివచ్చి హాయిని చేకూరుస్తోంది. ఉత్సాహంగా అడుగులువేస్తున్నాడు.

కొద్దిదూరంలో యేదో మానవాకారం త్రోవ కడ్డంగా పడివుంది. ఆత్రంతో పరుగెత్తి వెళ్లి చూశాడు. సూరి! చైతన్యరహితంగాపడివుంది. కారణమేమిటా? అని ఆలోచించాడు. చెయ్యి నాడి చూశాడు. నాడి ఆడుతోంది. చుట్టూ పరికించాడు. కొద్దిదూరంతో ఒక పాముజాడ కన్పించింది. పాము కాటువేసిందేమో అనే శంక పొడమింది. కాని, పాముజాడ మనిషి వరకూలేదు, మనిషి అడుగులు పాముజాడ వరకూలేవు. అయితే పామునుచూసి మూర్ఛపోయి వుంటుందనే నిర్ధారణచేసుకున్నాడు.

మసక మసకగా చీకటికూడా పడుతోంది. మైలుదూరంవరకూ పోవాలికూడా తను. విడిచిపెట్టిపోతే యేమయిపోతుందో ? తెలివి తెప్పించటానికి దగ్గరలో నీళ్లుకూడా లేవు. పెద్దచెఱువు చాలాదూరంలో వుంది. భుజాన వేసుకొనిపోతే నలుగురూ యేమనుకుంటారో? సందిగ్ధావస్థలో చిక్కుకున్నాడు నరసన్న. తుదకు ఏమయితే అదే కానిమ్మని సూరిని యెత్తుకొని భుజంమీద వేసుకున్నాడు. నిశిలో నిర్జనస్థలంలోపడి నిర్భయంగా వూరిలోకి దారితీశాడు.

* * *

ఈ సంఘటనజరిగిన కొద్దిరోజుల్లోనే సూరి నెలతప్పింది మునసబుగారి లోగిట్లో మునుగులో గుద్దులాట జరిగింది. నోరుపారేసుకొని సూరిని అడిగారు. సూరి నాకు ఏ కర్మా తెలీదంది. సూరిభోగట్టా వూరిలోనికి రానివ్వలేదు.

ఊరు వూరుకుంటుందా ? ఎక్కడికక్కడే ఎన్నో సంఘాలూ, సభలూ జరిపించింది. సంఘానికి యెక్కడో చిన్నదాగ కన్పించింది. అగ్గిలేనిదే పొగరాదని తీర్మానించింది. అగ్గి యెలా వచ్చింది ? — అని యేదో ఒక ఉపసంఘం ఒక ఉపప్రశ్నవేసింది.

ఇరవై రోజులక్రితమే చనిపోయిన రమణయ్య భార్యగా సూరి యిప్పుడు సంఘానికి కన్పడలేదు. ఒకనాటిచీకట్లో నరసన్న భుజం మీదనున్న సూరిగా కన్పించింది. అంతే! అదే జవాబిచ్చింది సంఘం.

కొన్నాళ్లకు ఒకనాడు భళ్లున తెల్లవారింది. తెల్లవారినతరువాత కోడికూసింది. ఆ కూత 'సూరికి అయిదో నెలండహో!' అని విన్పించింది లోకానికి.

* * *

లోకం గ్రుడ్డిది. గ్రుడ్డివానికి చెవులు బాగా వినబడతాయి మరి!

నిజానికి నరసన్న నెలతక్కువ నరసన్నా కాడు. సూరికి..............కాతకుడూ కాడు. లోకంచేతిలో కీలుబొమ్మమాత్రమే!

లక్ష్మమ్మ (తనంతట తాను చెడకపోయినా) లోకందృష్టిలో పవిత్రురాలు, సూరి జారిణి. ఇలా యెంతోమంది ఒక్కొక్కప్పుడు లోకం దృష్టిలో తారుమారు మారుతారు.

★